క్లుప్తంగా

నేలవాలిన విద్యుత్ తీగలు!



ముచ్చుకుంటతండాలో నేలవాలిన విద్యుత్ తీగలు

దుద్యాల్: మండల పరిధిలోని సాగారంతండా, ముచ్చుకుంటతండా సమీపంలో విద్యుత్ తీగలు ప్రమదకరంగా మారాయి. సాగారం తండా నుంచి ఔరారం వెళ్లే మార్గంలో చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. ముచ్చుకుంట తండా నుంచి దుద్యాల్ రూట్‌లో పొలంలోనే తెగిపడ్డాయి. రైతుల సమాచారంతో విద్యుత్ శాఖ అధికారులు ఈ ఫీడర్‌కు కరెంటు సరఫరా నిలిపేశారు. దీంతో తండాకు తాగునీరు సరఫరా చేసే బోరుమోటారుకు విద్యుత్ ఆగిపోయింది. ఫలితంగా తండావాసులు నీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి త్వరగా మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

తల్లి పేరుపై మొక్క నాటే కార్యక్రమం

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాండూరు బీజేపీ నాయకులు మాకే నామ్‌పే ఏక్ పేడ్ (తల్లి పేరుపై ఒక మొక్క) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు పెద్ద సంఖ్యలో నాటాలన్నారు. తల్లి పేరుపై ఒక్కొక్కరూ ఒక్కో మొక్క నాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశానుసారం నీడనిచ్చే, పండ్లను ఇచ్చే మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణాధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు ప్రకాష్, ప్రహ్లాద్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, రాంచందర్, సాయిలు, రాంసాగర్ పాల్గొన్నారు.

అలరించిన వీధి నాటకం

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్‌లో రామాయణం వీధి నాటకం నాలుగు రోజులుగా ప్రదర్శిస్తున్నారు. నాటకోపాధ్యాయుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో ఇది కొనసాగుతుంది. వీధి నాటకాన్ని చూడడానికి గ్రామస్తులు ఆసక్తి చూపారు. అంతరించిపోతున్న కళలకు ఆధారణ కల్పిస్తున్నారని పలువురు బుధవారం ప్రశంసించారు. కార్యక్రమంలో కళాకారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గోవింద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు చెందిన కుటుంబ సభ్యులు ఇటీవల మరణించడంతో బుధవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శించారు. రేగడిమైలారంలో రైతు సంఘం గ్రామాధ్యక్షుడు గోవింద్‌రెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి, చౌదర్‌పల్లిలో రిటైర్డ్ టీచర్ నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులకు కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేశ్‌రాజ్, జగదీశ్వరయ్య, శ్యామలయ్యగౌడ్, శేఖర్ ఉన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మైనార్టీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద ముస్లిం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాల ప్రారంభం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం అధికారులు, నాయకులు ముగ్గు పోశారు. గ్రామంలో 13 మందికి ఇళ్లు మంజూరు కాగా మండల అధికారి వెంకన్నగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి నిర్మాణాలు ప్రారంభించారు.

భయపెడుతున్న బడి

వేసవి సెలవుల విరామం అనంతరం గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో మండలంలోని శిథిలావస్థలకు చేరిన సర్కారు బడుల భవనాల తీరు విద్యార్థులు, తల్లిదండ్రులు కలవర పెడుతున్నాయి.

- శిథిలావస్థకు చేరిన భవనాలతో విద్యార్థుల గోస
- హస్నాబాద్, ఆలేడ్ గ్రామాల్లో దుస్థితి



శిథిలావస్థకు చేరిన హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

దుద్యాల్: బడి మాటెత్తితేకొందరు చిన్నారులు నానా పేచీ పెడుతూ అలజడి సృష్టిస్తారు. కానీ ఇక్కడ మాత్రం పాఠశాలలకు వెళ్లాలంటేనే ఆ భవనాలను చూసి విద్యార్థులు జంకుతున్నారు. ఎప్పుడు కూలుతాయోనని నిత్యం వణుకుతున్నారు. అవి ఎక్కడో కాదు మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత, బాలికల ప్రాథమికోన్నత, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలు. ఈ బడులకు సంబంధించి భవనాలను నిర్మించి దాదాపు 80 ఏళ్లు దాటిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకొని పైకప్పు పెచ్చులూడుతుండడంతో తరగతి గదుల్లో కూర్చోవాలంటే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

షాక్ కొడుతున్న గోడలు

వర్షాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం తడిసి ముద్దవ్వడంతో గోడలకు విద్యుత్ తీగలు తాకి షాక్ కొడుతున్నాయి. దీంతో విద్యార్థులు పరుగులు తీసిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. బాలికల ప్రాథమికోన్నత, హరిజనవాడ ప్రాథమిక, ఆలేడ్ ప్రాథమిక పాఠశాలల తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం భయంతో బడికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడిన ఘటనలు ఉన్నాయి.

కొనసాగుతున్న నిర్మాణ పనులు

హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ప్రభుత్వం స్పందించి 15 అదనపు గదులను



పెచ్చులూడిన హరిజనవాడ పాఠశాల తరగతి గది

నిర్మించుటకు రూ.1.65 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికి అందుబాటులోకి వస్తాయని భావించిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెళ్లాలంటే భయం



చదువుపై ఇష్టంతో పాఠశాలకు వెళ్తాను. కానీ భవనం శిథిలావస్థకు చేరడంతో గతేడాది పైకప్పు పెచ్చులూడి పడింది. వర్షాలకు గోడలు తడిసి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో భయంతో బయటకు పరుగులు పెట్టాం. ప్రభుత్వం స్పందించి కొత్త భవనం నిర్మించాలి.

– వర్షిణి, 9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, హస్నాబాద్

ఎన్నోసార్లు పెచ్చులూడాయి



శిథిలావస్థ పాఠశాలకు వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. ఎన్నోసార్లు పైకప్పు పెచ్చులూడి మాపై పడ్డాయి. భారీ వర్షాలు పడితే కూలిపోయే ప్రమాదం ఉంది. నిత్యం భయంతో పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

– నికిత, 6వ తరగతి, జీయూపీఎస్, హస్నాబాద్

పరిష్కారం చూపాలి



తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో గతంలో ప్రమాదం చోటు సంభవించింది. అప్పటినుంచి నేటి వరకు పాఠశాలకు వెళ్లాలంటే భయం. అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు తప్పా పరిష్కరించడం లేదు. మరో ఘటన జరగకముందే యంత్రాంగం మేల్కోవాలి.

– అవంతిక, 4వ తరగతి, ప్రాథమిక పాఠశాల హరిజనవాడ

పంటల నమోదు తప్పనిసరి



రైతులకు సూచనలు అందిస్తున్న విస్తరణ అధికారి

పరిగి: వర్షాకాలంలో రైతులు సాగు చేసే పంటలపై అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాపోల్ రైతు వేదికలో రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాల పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా మారిందన్నారు. రైతులు పంటల వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సలహా సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

దేవనూరులో బోరు ఏర్పాటు



కొత్త కాలనీలో బోరు వేయిస్తున్న నాయకులు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ దేవనూరు గ్రామ అధ్యక్షుడు ఖాసీం అన్నారు. బుధవారం గ్రామంలోని కొత్త కాలనీలో బోరు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీ గ్రామమైన దేవనూరులో కొత్తగా ఏర్పడిన కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా బోరును వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్, రఫీక్, శ్రీశైలం, కేఎస్‌ఎస్, మొగులప్ప, నర్సింహులు, మాజీద్, మహ్మద్ తదితరులు ఉన్నారు.

బడి గంటకు వేళాయె



దుద్యాల్: మధ్యాహ్న భోజన కార్మికులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించారు. ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి తదితర సదుపాయాలు కల్పిస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. తమ పిల్లలని సర్కారు బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గురువారం బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఎంఈఓలు ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు పలు సూచనలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



దౌల్తాబాద్: శిక్షణలో మాట్లాడుతున్న హెచ్‌ఎం



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శంకర్‌పల్లి: ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలకు సంబంధించి పక్కా రికార్డులను మెయింటెన్ చేయాలని, అదేవిధంగా రైతులకు విధిగా రశీదులు అందించాలన్నారు. డబ్బులకు ఆశపడి నకిలీ విత్తనాలను అమ్మితే పెద్దఎత్తున జరిమానాతో పాటు కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి కూతురు రిషికరెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.4లక్షల ఎల్‌ఓసీని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆశన్నగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

కొడంగల్ రూరల్: మండలంలోని పలు దుకాణాల్లో జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవాలని ఏఓ తులసి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ పీఏసీఎస్‌లో జీలుగ విత్తనాలు 50 బ్యాగులు, జనుము విత్తనాలు 35 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, రుద్రారంలోని ఏఆర్‌ఎస్‌కే దుకాణంలో జీలుగ 110 బ్యాగులు, జనుము 55 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ల అందజేత

కుల్కచర్ల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య బుధవారం అందజేశారు. అనంతరం ముగ్గు పోసి నిర్మాణాలు ప్రారంభించారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్కరికి సైతం ఇల్లు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హర్షవర్ధన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు నర్సింలు, నర్సయ్య, హన్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అర్జీలు



దౌల్తాబాద్: రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కుల్కచర్ల: రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న అధికారులు

దౌల్తాబాద్/బొంరాస్‌పేట/కుల్కచర్ల/దుద్యాల్/మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లో నిషేధిత జాబితాలో ఉన్న భూములు, యాజమాన్య హక్కుల వివాదాలు తదితర సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఆయాచోట్ల రెవెన్యూ అధికారులు, సిబ్బంది అర్జీలను స్వీకరించారు. నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

దీర్ఘకాలంగా ఉన్నవారికే పదవులివ్వండి

నవాబుపేట: సుదీర్ఘ కాలంగా పార్టీ కోసం పని చేస్తున్న వారికే పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గీతాసింగ్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న చిట్టిగిద్ద ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎండీ ఇక్బాల్‌కు మండల అధ్యక్షుడిగా నియమించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవీందర్‌రెడ్డి, ఎండీ రఫీ, శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, రాములు, రామచంద్రారెడ్డి, దయాకర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు



పంటల మార్పిడి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త మహదేవప్ప, రైతులు

శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప

మొయినాబాద్‌రూరల్: పంటల సాగులో మెలకువలు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీమహదేవప్ప అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహదేవప్ప మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు పాటించినప్పుడే అధిక లాభాలు పొందుతారన్నారు. భూసార పరీక్షలు, పంట మార్పిడి, రసాయన ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికంగా ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటు నేల స్వభావాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ యాదవ్, కో –ఆప్షన్ మెంబర్ రాంచంద్రారెడ్డి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

చేవెళ్ల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఏసీపీ కిషన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ వద్ద బుధవారం పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాత చేవెళ్లకు చెందిన పద్మావతి కన్వెన్షన్ యజమాని ఎం.కృష్ణారెడ్డి, మాలతి దంపతులు రూ.16 లక్షల చెక్కును ఏసీపీ, సీఐ భూపాల్‌శ్రీధర్‌కు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు అడిగిన వెంటనే సామాజిక సేవా దృక్పథంతో ముందుకొచ్చిన మర్పల్లి మాలతికృష్ణారెడ్డి దంపతులను వారు అభినందించారు. దాత కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, లక్ష్మారెడ్డి, వెంకటేశ్, రవి, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, గని, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు చెక్కు అందిస్తున్న దాత కృష్ణారెడ్డి

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థ పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను తగ్గించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు డిపో సీఐ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్‌పాస్ చార్జీలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయని, మళ్లీ పెంచాలని చూడటం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్ హామీ కారణంగా వస్తున్న నష్టాలను పూడ్చుకునేందుకే విద్యార్థులపై భారం మోపుతున్నారన్నారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలని, లేనియెడల విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి నవీన్‌నాయక్, సాయి, మనోజ్, నవీన్, చరణ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి

జోరుగా అమ్మమాట–అంగన్‌వాడీబాట

ధారూరు: ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని ధారూరు, నాగసమందర్ గ్రామాల్లో బుధవారం స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట నిర్వహించారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆమె వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చిన్నారులు, టీచర్లు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తారని సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంత, టీచర్లు రమాదేవి, అనురాధ, భాగ్య, జగదీశ్వరీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మెనూలో ఎగ్‌బిర్యానీ

తాండూరు టౌన్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ పరిధిలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొత్తగా మెనూలో ఎగ్ బిర్యానీ కూడా చేర్చామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్, సూపర్‌వైజర్ సుశీల, టీచర్ రాధ, ఆయమ్మ అనిత, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: గోకఫసల్‌వద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రెండున్నర ఏళ్లు దాటిన..

బంట్వారం: చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని తొర్మామిడి గ్రామంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమం నిర్వహించారు. రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, మాధవి, మరియమ్మ, లలిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణిమాల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: నాగసమందర్‌లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ

గోకఫసల్‌వాద్‌లో..

దౌల్తాబాద్: రెండున్నర ఏళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. బుధవారం అమ్మబాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పుతారని మర్పల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానబేగం అన్నారు. సిరిపురం, బూచన్‌పల్లి, రామపూర్, మర్పల్లి గ్రామాల్లో అమ్మబాట– అంగన్‌వాడీ బాట నిర్వహించారు.